## పాలక మండలి సమావేశంలో లోటుపాట్లకు తావు ఉండొద్దు

### ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

భద్రాచలం, ఫిబ్రవరి16: పట్టణంలోని ఐటీడీఏ కార్యాలయంలో ఈ నెలలో జరుగనున్న పాలక మండలి సమావేశంలో ఎలాంటి లోటు పాట్లు ఉండొద్దని, సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ ఆదేశించారు. పట్టణంలోని ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం ఆయన యూనిట్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సమావేశానికి పలువురు మంత్రులతో పాటు ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్ కలెక్టర్లు, వివిధశాఖల అధికారులు హాజరవుతారన్నారు. ప్రభుత్వ అధికారులు వారి శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ తానాజీ, ఎస్వో సురేశ్‌బాబు, జీసీసీ డీఎం విజయ్‌కుమార్, ఏవో భీం, డీటీ ఆర్వోఎఫ్ఆర్ శ్రీనివాస్, ఏడీ అగ్రికల్చర్ భాస్కర్ పాల్గొన్నారు.

## మారుమూల గ్రామాల అభివృద్ధే లక్ష్యం

### సీసీ రోడ్ల నిర్మాణానికి 1.17 కోట్లు మంజూరు

### బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత, ఎంపీ నామా వెల్లడి

ఖమ్మం, ఫిబ్రవరి 16 : ఉమ్మడి జిల్లాలోని మారుమూల ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ఎంపీ నిధులను పెద్ద ఎత్తున ఖర్చు చేశానని, తాజాగా భద్రాద్రి జిల్లా అభివృద్ధి కోసం తన కోటా నుంచి రూ.1,17,50,500 మంజూరు చేసినట్లు బీఆర్ఎస్ లోక్‌సభాపక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకొని ఈ నిధులు కేటాయించానని తెలిపారు. భద్రాద్రి జిల్లాలోని అశ్వారావుపేట, చండ్రుగొండ, దమ్మపేట, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ మండలాలకు చెందిన గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, కల్వర్టులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల ప్రహరీ నిర్మాణాలకు తన కోటా నుంచి నిధులు మంజూరు చేశానని చెప్పారు. త్వరలోనే ఆయా పనులకు శంకుస్థాపన చేసి.. పనులు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు భద్రాద్రి జిల్లాలోని గ్రామాల అభివృద్ధికి తన ఎంపీ నిధులను పెద్ద ఎత్తున కేటాయించి ఖర్చు చేస్తున్నట్లు నామా తెలిపారు.

# నీటి తడుల్లేక కంటతడి

- పాత పాలేరు ఆయకట్టులో రైతుల క'న్నీటి' గాథ
- నీటి తడులు అందక ఎండిపోతున్న పంటలు
- ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీరు విడుదల చేయాలని విన్నపం





కూసుమంచి, ఫిబ్రవరి 16: ఎగువన సాగర్ ప్రాజెక్ట్‌లో జలాలు నిండుకోవడంతో ఖమ్మం జిల్లాకు సాగు జలాలు వచ్చే పరిస్థితి లేదు. దీంతో ఈ సీజన్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులు నష్టపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. నష్టపోయే వారిలో పాలేరు పాత కాలువ ఆయకట్టు రైతులూ ఉన్నారు. ఆయకట్టు పరిధిలో ప్రస్తుతం రైతులు 7,548 ఎకరాల్లో వరి, 614 ఎకరాల్లో చెరుకు సాగు చేస్తున్నారు. వీటిలో సాగునీరు ప్రస్తుతం అందక 500 ఎకరాలకు పైగా పైరు ఎండింది. కొన్నిచోట్ల భూములు నెర్రెలు బారాయి. ప్రస్తుత పరిస్థితుల్లో సుమారు మరో వెయ్యి ఎకరాల పంటను రైతులు వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు తెలుస్తున్నది.

### ఈ గ్రామాల్లో తీవ్రత ఎక్కువ..

పాలేరు పాత కాలువ ఆయకట్టు పరిధిలోని కూసుమంచి మండలం పెరికసింగారం, మల్లేపల్లి, ముటాపురం, జక్కేపల్లి, గోరీలపాడు తండా, నేలకొండపల్లి మండలంలో చెన్నారం, బోదులబండ, సుర్దేపల్లి, మంగ్రాసుపల్లి, రామచంద్రాపురం, తిరుమలాపురం, కోనాయిగూడెం, ఆరెగూడెం, సింగరెడ్డిపాలెం, పైనంపల్లిలో సాగు చేస్తున్న పంటలు నీటి తడులు అందక ఎండిపోయాయి. పెరికసింగారం, జక్కేపల్లిలో తీవ్రత కొంచెం ఎక్కువగా కనిపిస్తున్నది. పొలాల్లో బోరు వసతి ఉన్న వారు మాత్రం మిగిలిన పంటనైనా కాపాడుకునేందుకు యత్నిస్తున్నారు. ప్రస్తుతం పాలేరు జలాశయానికి జలాలను కేవలం ప్రజల తాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించాలని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు ఉండడంతో యంత్రాంగమూ చేతులెత్తేసే పరిస్థితి నెలకొన్నది. కళ్లముందే పంట ఎండిపోతుంటే రైతులు ఆందోళనకు గురవుతున్నారు. నేలకొండపల్లి మండలం అప్పలనర్సింహాపురానికి చెందిన చిమటం నర్సయ్య అనే రైతు బోరును నమ్ముకుని ఎకరంన్నరలో వరి సాగు చేస్తున్నాడు. భూగర్భజలాలు ఇంకిపోవడంతో తాను సాగు చేస్తున్న పంటను ఇటీవల పశువులకు వదిలేశాడు.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కనీసం రెండు తడులకు నీరు వదలాలని రైతులు కోరుతున్నారు.

### మూడు ఎకరాల పంట ఎండింది..



నేను ఆరెకరాల్లో వరి వేశాను. పాలేరు పాత కాలువకు జలాలు వస్తాయని ఆశించా. కానీ నిరాశే ఎదురైంది. ప్రస్తుతం మూడెకరాలు ఎండిపోయింది. మిగిలిన పంటకు మరో రెండు తడులు ఇస్తే తప్ప చేతికొచ్చే పరిస్థితి లేదు. ఇప్పటి వరకు నేను రూ.1.50 లక్షల పెట్టుబడి పెట్టాను. మరోవైపు బోర్లు కూడా ఎండిపోతున్నాయి. పంటను కాపాడుకోవడానికి ఏం చేయాలో తెలియడం లేదు.

**– గునుగుంట్ల సూరయ్య, రైతు, పెరికసింగారం**

### కౌలు చెల్లించలేని పరిస్థితి..



నేను రెండెకరాలు కౌలుకు తీసుకున్నా. ఒక్కో ఎకరానికి రూ.22 వేలు కౌలు చెల్లించాల్సి ఉన్నది. ఆ భూమిలో ప్రస్తుతం వరి సాగు చేస్తున్నా. జలాలు రాకపోవడంతో ఎకరా పంట ఎండిపోయింది. పంట చేతికొచ్చే పరిస్థితి, భూయజమానికి కౌలు చెల్లించే పరిస్థితి లేదు. ఏం చేయాలో దిక్కు తోచడం లేదు.

**– అజ్మీరా రెడ్యానాయక్, రైతు, దేవులాతండా**



జక్కేపల్లిలో ఎండిన వరి పొలం



నీరు లేక ఖాళీగా దర్శనమిస్తున్న పంట కాలువ

### నష్టాలు తప్పవు..



నాకు రెండు ఎకరాల పొలం ఉంది. దానిలో నేను వరి పండిస్తున్నా. నీరు అందక ఇప్పుడు ఎకరంన్నర ఎండిపోయింది. రూ.50 వేల పెట్టుబడి గంగలో పోసినట్లయింది. ఈ సారి నష్టాలు తప్పవు. రాష్ట్రప్రభుత్వం రైతులపై దయ ఉంచి రెండు తడులకు జలాలు విడుదల చేయాలి. పాలేరు ఆయకట్టు రైతులకు ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి రాలేదు.

**– బత్తుల వెంకటకృష్ణ, రైతు, పెరికసింగారం**

# నిరసన జ్వాల



ఖమ్మం నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గ్రామీణ భారత్ బంద్ సంపూర్ణం
- కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాస్తారోకోలు, ర్యాలీలు

ఖమ్మం, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అఖిల పక్షాలు, కార్మిక, ప్రజాసంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గ్రామీణ భారత్ బంద్ విజయవంతమైంది. వామపక్షవాదులు, ప్రజాసంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల కార్యకర్తలు రోడ్ల మీదకు వచ్చి బీజేపీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ప్రదర్శనలు, రాస్తారోకోలు నిర్వహించారు. తెల్లవారుజామునే పట్టణాల్లోని బస్ డిపోల వద్దకు వెళ్లి బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. బంద్ పిలుపును అందుకుని వ్యాపార వాణిజ్య సంస్థలు, పెట్రోల్ బంక్‌లు, విద్యాసంస్థలు, బ్యాంకులు, సినిమా థియేటర్ల యాజమాన్యాలు స్వచ్ఛందంగా వాటిని మూసివేశాయి. ఆటో డ్రైవర్ల యూనియన్లు, వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. బంద్ కారణంగా బ్యాంకుల్లో లావాదేవీలు నిలిచిపోయాయి. రాస్తారోకోల కారణంగా ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రజా రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకున్నారు. కొత్తగూడెంలో అఖిల పక్షాల ఆధ్వర్యంలో నాయకులు ర్యాలీ నిర్వహించారు. సింగరేణి పరిధిలోని గనుల్లో వివిధ సంఘాలకు చెందిన కార్మికులు విధులకు గైర్హాజరయ్యారు. నిరసన కార్యక్రమాల్లో సీపీఐ, కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్, టీడీపీ, బీఎస్పీ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీతో పాటు ఇతర సంఘాలు, పార్టీలకు చెందిన నాయకులు నున్నా నాగేశ్వరరావు, పోతినేని సుదర్శన్‌రావు, ఎర్రా శ్రీకాంత్, విక్రమ్, పోటు ప్రసాద్, భాగం హనుమంతరావు, తాటి వెంకటేశ్వర్లు, జానీ మియా, పోటు కళావతి, నిర్మల, కొత్త సీతారాములు, నున్నా మాధవరావు, గోకినపల్లి వెంకటేశ్వరరావు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



ఖమ్మం నగరంలో మూతపడిన షాపులు



ఖమ్మంలో స్కూల్ బస్సును అడ్డుకుంటున్న నిరసనకారులు



కొత్తగూడెం పట్టణంలో అఖిలపక్ష నాయకుల ర్యాలీ



చండ్రుగొండలో ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు, బీఆర్ఎస్ శ్రేణులు

## బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలి

### ఖమ్మం సీపీ సునీల్ దత్



కల్లూరు ఠాణాను సందర్శిస్తున్న సీపీ సునీల్ దత్

కల్లూరు, ఫిబ్రవరి 16 : బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూ ప్రజలకు పోలీసు వ్యవస్థపై మరింత నమ్మకాన్ని పెంచడానికి కృషి చేయాలని సీపీ సునీల్ దత్ అన్నారు. శుక్రవారం కల్లూరు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన రికార్డులను తనిఖీ చేయడంతోపాటు స్టేషన్ నిర్వహణ, పోలీసుల పనితీరును తెలుసుకొని, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించాలని, వీటికి విఘాతం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులు, అసత్య ప్రచారాలపై ఎప్పటికప్పుడు గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, రాత్రి పెట్రోలింగ్ ముమ్మరం చేయడంతోపాటు వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. కేసు నమోదు విషయంలో ఆలస్యం చేయకుండా వెంటనే నమోదు చేయాలన్నారు. ఆయన వెంట కల్లూరు ఏసీపీ అనిశెట్టి రఘు, ఎస్సై షాకీర్ ఉన్నారు.


## రామాలయంలో వెండి ఇటుక మాయం

భద్రాచలం, ఫిబ్రవరి 16 : స్వామివారి ఆభరణాలకు సంబంధించి ఏటా నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో వెండి ఇటుక మాయమైనట్లు వెలుగులోకి వచ్చింది. గురువారం తనిఖీలు చేపట్టిన దేవాదాయ ధర్మాదాయ శాఖ జ్యూవెల్లరీ వెరిఫికేషన్ అధికారి అంజని బంగారు ఆభరణాలకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. తర్వాత వెండి వస్తువులకు సంబంధించి రికార్డులను తనిఖీ చేస్తుండగా.. ఆరు కేజీల వెండి ఇటుక ఉన్నట్లు రికార్డుల్లో నమోదై ఉన్నా.. అది కనిపించలేదు. గతంలో రామాలయానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు సమర్పించిన వెండి ఆభరణాలు విరిగిపోయినా.. రూపుమారినా.. నిరుపయోగంగా ఉన్న 50 కేజీల వెండిని హైదరాబాద్‌లోని మింట్‌లో కరిగించి 11 వెండి ఇటుకలుగా తయారు చేయించారు. ఇందులో నాలుగు ఇటుకలను దేవస్థానం అవసరాల కోసం వినియోగించగా.. మరో ఏడు ఇటుకలు ఉండాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఆరు ఇటుకలు మాత్రమే కనిపిస్తున్నాయని దేవస్థానం అధికారులు చెబుతున్నారు. దీనిపై దేవస్థానం ఈవో రమాదేవిని వివరణ కోరగా.. వెండి ఇటుక కనిపించకపోతే సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, ఎట్టి పరిస్థితుల్లోనూ రికవరీ చేస్తామని, ఈ విషయంలో ఎవరినీ వదిలేది లేదని పేర్కొన్నారు.

## కొత్త గనుల ఏర్పాటుకు సహకరిస్తాం..

### బొగ్గు ఉత్పత్తి, రవాణాలో సింగరేణి సంస్థ పనితీరు భేష్

### కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్‌లాల్ మీనా



మాట్లాడుతున్న సీఎండీ బలరాం, కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్‌లాల్ మీనా

కొత్తగూడెం సింగరేణి, ఫిబ్రవరి 16 : సింగరేణి సంస్థ కొత్తగా చేపట్టనున్న గనుల కోసం పూర్తి సహకారం అందిస్తామని కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి అమ్రిత్‌లాల్ మీనా హామీ ఇచ్చారు. సంస్థ పనితీరు సంతృప్తికరంగా ఉన్నదని, ఈ ఏడాది నిర్దేశించుకున్న 70 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్య సాధనలో ముందుండడంపై ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్‌లో ఆయన సంస్థ సీఎండీ బలరాం, ఇతర డైరెక్టర్లతో కంపెనీ ప్రగతిపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి ప్రస్తుత పనితీరు, భవిష్యత్ ప్రణాళికలపై సీఎండీ బలరాం వివరించారు. సింగరేణి ప్రాంతంలోని మూడు బొగ్గు బ్లాకుల కేటాయింపు సింగరేణి సంస్థకే కేటాయించేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రానున్న కాలంలో చేపట్టనున్న కొత్త గనులకు త్వరితగతిన అనుమతులు లభించేలా చూడాలన్నారు. దీనిపై కేంద్ర బొగ్గు శాఖ కార్యదర్శి స్పందిస్తూ.. నిబంధనలకు లోబడి సింగరేణికి మేలు కలిగే విధంగా తగిన సహకారం అందిస్తామన్నారు. సమావేశంలో కేంద్ర బొగ్గు శాఖ అదనపు కార్యదర్శి రూపేందర్ బ్రార్, డిప్యూటీ డైరెక్టర్ సంతోశ్, సంస్థ డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎన్‌వీకే శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్‌రెడ్డి, ఈడీ జే.ఆల్విన్ పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌ను కలిసిన ఎమ్మెల్యే రాగమయి దంపతులు



సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 16: సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్ దంపతులు శుక్రవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారంపై సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

### రామాలయ ఈవోగా మళ్లీ రమాదేవినే..

భద్రాచలం, ఫిబ్రవరి 16 : భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఈవోగా విధులు నిర్వర్తిస్తున్న ఎల్.రమాదేవిని కీసర ఆర్డీవోగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. అయితే ఆలయ అభివృద్ధికి పాటుపడుతున్న ఆమెను బదిలీ చేయొద్దని, నిలుపుదల చేయాలని బీఆర్ఎస్, ప్రజా సంఘాలు, వివిధ పార్టీల నాయకులు, అర్చకులు, సిబ్బంది, పట్టణ ప్రముఖులు రోడ్లపైకి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో డిప్యూటేషన్ ప్రాతిపదికన ఆమెను తిరిగి దేవస్థాన ఈవోగా కొనసాగిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రామ భక్తులు, పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

### భద్రాద్రిలో ముగిసిన రామదాసు జయంత్యుత్సవాలు

భద్రాచలం, ఫిబ్రవరి 16 : భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానం, సామగాన లహరి కల్చరల్ ట్రస్ట్, నేండ్రగంటి అలివేలు మంగ ఛారిటబుల్ ట్రస్ట్, శ్రీచక్రా సిమెంట్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న భక్త రామదాసు 391వ జయంత్యుత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. జయంత్యుత్సవాల్లో పాల్గొన్న కళాకారులు తమ గాత్రంతో, సంగీత కచేరీలతో, వాయిద్య పరికరాలతో ఎంతో మంది సంగీతాభిమానులను మురిపించారు. సంగీతాభిమానులకు వీనుల విందైన అనుభూతి అందించారు. అలాగే భక్త రామదాసు, తూము నరసింహదాసు కీర్తనలు శ్రోతల మదిని దోచాయనడంలో ఎలాంటి సందేహం లేదు. దేవస్థానం అధికారులు ఐదు రోజులపాటు వివిధ కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించారు.

## ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- పొన్నెకల్లులో 7 నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు : కలెక్టర్ గౌతమ్
- కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు : సీపీ సునీల్ దత్
- శ్రీచైతన్య కళాశాలలో కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూంల పరిశీలన



శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ సునీల్‌దత్, అధికారులు

కూసుమంచి(ఖమ్మం రూరల్), ఫిబ్రవరి 16 : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు ప్రక్రియ కోసం అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ఎన్నికల నిబంధనలకు లోబడి అధికారులు సమర్థంగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. రూరల్ మండలం పొన్నెకల్లులోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలోనే జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్లను లెక్కించాలని నిర్ణయించిన కలెక్టర్, సీపీ సునీల్ దత్, ఇతర అధికారులతో కలిసి శుక్రవారం కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూం, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు, భద్రత, పార్కింగ్ ఏర్పాట్లను జాగ్రత్తగా పర్యవేక్షించాలన్నారు. నిరంతర విద్యుత్, తాగునీటి సౌకర్యంతోపాటు పోస్టల్ బ్యాలెట్లకు ప్రత్యేక గదులు సిద్ధం చేయాలన్నారు. పోలింగ్ నిర్వహణ, రిసెప్షన్ బాధ్యతలు నిర్వహించే సిబ్బందికి మండలాల్లో ఎంపీడీవోలు, ఎన్నికల బాధ్యులు తర్ఫీదు ఇవ్వాలన్నారు. ఒకే గదిలో ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరచాలన్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత బ్యాలెట్లు, ఈవీఎంలను సీఆర్‌పీఎఫ్ రక్షణతో కౌంటింగ్ కేంద్రానికి తరలించాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఎన్నికల సరళిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఇందుకోసం ఫ్లయింగ్ స్క్వాడ్, సెక్టార్ అధికారులను ప్రత్యేకంగా నియమించాలన్నారు.

### కట్టుదిట్టమైన భద్రత : సీపీ సునీల్ దత్

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ విషయంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సీపీ సునీల్ దత్ ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద పూర్తిస్థాయి బందోబస్తు నిర్వహించాలని, ఈవీఎంల రవాణా, భద్రతపై నిఘా పెట్టాలన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, రాంబాబు, ఖమ్మం, కల్లూరు, కొత్తగూడెం ఆర్డీవోలు గణేశ్, అశోక్ చక్రవర్తి, మధు, ఎస్డీసీ రాజేశ్వరి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్యాంప్రసాద్, సంక్షేమాధికారి రాంగోపాల్‌రెడ్డి, డీపీవో హరికిషన్, డీఎల్‌సీవో గంటా శ్రీలత, జిల్లా అధికారులు శ్రీనివాసులు, జయప్రకాశ్, ఏసీపీ బస్వారెడ్డి, ఈఈ పుష్పలత, ఎన్నికల సూపరింటెండెంట్ రాంబాబు, రూరల్ తహసీల్దార్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సీపీని కలిసిన టౌన్ ఏసీపీ



మామిళ్లగూడెం, ఫిబ్రవరి 16 : ఖమ్మం టౌన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్(ఏసీపీ)గా ఎస్వీ రమణమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన సీపీ సునీల్ దత్‌ను పోలీస్ కమిషనరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కాగా.. రమణమూర్తి ఇల్లెందు డీఎస్పీగా పనిచేసి పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం టౌన్‌కు బదిలీపై వచ్చారు.